క్లుప్తంగా

## నర్సంపేటలో భారీ వర్షం

నర్సంపేట : పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వ్యవసాయ మార్కెట్లో మక్కలు తడిచిపోయాయి. నర్సంపేట నుంచి మల్లంపల్లి మీదుగా హైవేలో రైతులు ఆరబోసుకున్న మక్కలు వరదపాలయ్యాయి.

## బొడ్రాయి వార్షికోత్సవం

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌లో బొడ్రాయి (గ్రామదేవత) ప్రతిష్ఠాపన వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, నాభిశిల విగ్రహాలకు పురోహితులు దూపం మఠం రాజు నూతన వస్త్రాలు ధరింపజేసి పూజ చేశారు. గ్రామస్తులు బొడ్రాయికి నీళ్లు పోసి కొబ్బరికాయలు కొట్టి పూజించారు. మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్ దేవతామూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించగా వేల్పుల సురేశ్ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. లక్కర్సు రవికుమార్ పూలమాలలు సమకూర్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నరిశెట్టి నరేందర్, దూపటి యుగేందర్, వల్లుల సారంగపాణి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నల్లబెల్లి : మండలంలోని నందిగామలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు బోధించిన హెచ్‌ఎం షన్ముఖచారి, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, నాగరాజు, విజయ్‌కుమార్, లావణ్య, అనురాధ, ఆగమ్మలను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఐక్యంగా భవిషత్‌లో సామాజిక సేవలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు జగన్, రమేశ్, నాగరాజు, హరిబాబు, శైలజ, మమత, సుమత తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణతో వెలుగులు



నెక్కొండ : ఎస్సీ వర్గీకరణతో దళితుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పాలిశెట్టి భానుప్రకాశ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చరిత్రాత్మకమని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపట్టి దళితుల ఆకాంక్ష నెరవేర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపారని తెలిపారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు ఈదునూరి ప్రభాకర్, ఇటుకాల సంజీవ, ఈదునూరి రమేశ్, మచ్చ వీరన్న, ప్రవీణ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 489లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ వరంగల్ ఆర్డీఓకు స్థానికుడు పటాన్ సద్దాం ఖాన్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సద్దాం ఖాన్ మీడియాతో మాట్లాడారు. సర్వే నంబర్ 489లోని ప్రభుత్వ పోరంబోకు భూమి నిషేధిత భూముల జాబితాలో ఉందన్నారు. సదరు భూమిని రెండు గుంటలు చొప్పున షేక్ బాషుమియా, షేక్ సమ్రీన్ సలహా ఆక్రమించారని చెప్పారు. ఆక్రమణదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

## ‘డ్రంకెన్ డ్రైవ్’లో జరిమానా

గీసుకొండ : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారికి న్యాయమూర్తి జరిమానా విధించారు. సీఐ మహేందర్ కథనం ప్రకారం.. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహించగా 18 మంది మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని వరంగల్ రెండో తరగతి కోర్టులో మంగళవారం హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.18 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

## రాంకుమార్‌కు అవార్డు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బొల్లం రాంకుమార్‌ను దళితరత్న అవార్డు వరించింది. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రభుత్వం సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాంకుమార్‌కు అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్లు చెరుకు రాంచందర్, ఇటుక రాజు అవార్డు అందజేసి అభినందించారు.

# పల్లెల్లో ‘ఉపాధి’ జాతర

● పెరుగుతున్న కూలీల సంఖ్య



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

నెక్కొండ : గ్రామాల్లోని నిరుపేదలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చి మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద మండలవ్యాప్తంగా పనులు ప్రారంభమయ్యాయి. ఉపాధి హామీ పనులకు నమోదు చేసుకుంటున్న కూలీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో పనులు జోరుగా కొనసాగుతున్నాయి.

**రోజూ 3 వేల మందికి పని**

మండలవ్యాప్తంగా రోజు సుమారు 3000–3200 మందికిపైగా కూలీలు పనులకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. మండలంలోని నాగారం, బొల్లికొండ, దీక్షకుంట, చంద్రుగొండ, అప్పల్‌రావుపేట, అలంకానిపేట, రెడ్లవాడ, గొట్లకొండ, సూరిపల్లి, నెక్కొండతోపాటు పలు గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో కూలీలు పనులకు వెళ్తున్నారు. అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతీరోజూ ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు. కూలీల సమస్యల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. ఎండల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. పని ప్రదేశాల్లో చలువ పందిళ్లు, తాగునీరు, ఇతర వసతులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కూలీలకు నాలుగు వారాల బిల్లు చెల్లించాల్సి ఉంది.

**సకాలంలో బిల్లుల చెల్లింపు**



కూలీల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. మొదట వెయ్యి మందితో మొదలవగా ప్రస్తుతం సుమారు 3 వేల మంది కూలీలు పని చేస్తున్నారు. రోజుకు కూలి రూ.280–300 వరకు పడుతోంది. బిల్లుల చెల్లింపు సైతం సకాలంలో జరుగుతోంది.

– ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ, నెక్కొండ

**పనులివే..**

ఎండాకాలం ప్రారంభం నుంచే మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రహదారులను సరిచేయటం, సాగునీటి కాల్వల్లోని మట్టిని తీయడం, కొన్ని గ్రామాల్లో చెరువుల పూడిక తీత, వరద మళ్లింపు, నర్సరీల్లో మొక్కల పెంపకం తదితర పనులు జరుగుతున్నాయి.

**రూ.307కు కూలి పెంపు**

ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు దినసరి కూలి రూ.300 నుంచి రూ.307కు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈనెల 1 నుంచి కూలి పెంపును అమల్లోకి తీసుకొచ్చినట్టు అధికారులు తెలిపారు. కూలి పెంపుతో గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జాతరలా కొనసాగుతున్నాయంటే అతిశయోక్తి లేదు.

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



వర్ధన్నపేట : సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దయాకర్‌రావు, నాయకులు

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట : ఈనెల 27న హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. పట్టణ శివారులోని డీసీ తండాలో గిరిజనులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనేక మోసపూరిత హామీలతో గద్దెనెక్కి ప్రజలను విస్మరిస్తూ మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న తప్పుడు విధానాలను ఎండగట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ స్వార్థ పాలనకు చరమగీతం పాడే దిశగా ప్రజలు సన్నద్ధమవుతున్నారని తెలిపారు. తొలుత రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ వర్ధన్నపేట మండల ఇన్‌చార్జ్ లలిత యాదవ్, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు గోధుమల మధు, నాయకులు తుమ్మల యాకయ్య, నూనావత్ వసంత్, బానోతు అనిత శ్రీను, గోరా, రవి, అనిల్, భూక్యా రామన్న, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల, జీజీఆర్‌పల్లి, చిన్న గురిజాల గ్రామాల్లో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ ఆవిష్కరించి మాట్లాడారు. తొలుత సీనియర్ కార్యకర్తలు, నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మోతె పద్మనాభరెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోటూరి రవి, కొడారి రవి, తాళ్లపెల్లి రాంప్రసాద్, కుమారస్వామి, చిన్నపెల్లి నర్సింగం, పురాణి రవీందర్, బండారి రమేశ్, గడ్డం కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యాభ్యాసానికి రూ.50 వేల సాయం



గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన నమిండ్ల సుష్మా స్వరాజ్ వైద్య విద్యాభ్యాసానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి మంగళవారం రూ.50 వేల సాయం అందజేశారు. సుష్మా స్వరాజ్ ఎంసెట్‌లో ప్రతిభ చాటి నారాయణపేట మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించి మొదటి సంవత్సరం చదువుతోంది. పేదరికం నేపథ్యంలో ఆమె తల్లిదండ్రులు ఫీజుల చెల్లింపు, ఇతర ఖర్చుల కోసం ఇబ్బంది పడుతుండగా బాలకిశోర్‌రెడ్డి స్పందించారు. సుష్మా స్వరాజ్ వైద్య విద్య పూర్తయ్యేంత వరకు అయ్యే ఖర్చును భరిస్తానని భరోసా ఇచ్చారు. ఆయన పంపించిన నగదును సుష్మా స్వరాజ్ తల్లిదండ్రులకు నాయకులు వీరగోని రాజ్‌కుమార్, అల్లం మర్రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు డోలె చిన్ని, గోనె మల్లారెడ్డి, దొడు బాబు, నాయకులు మంద రమేశ్, మర్రి రాజలింగం, బత్తిని భాస్కర్, కూనూరి వీరభద్రం, శ్రీనివాస్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ‘ఎఫ్‌ఏల వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం’

దుగ్గొండి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల (ఎఫ్‌ఏ) వేతనాల చెల్లింపులో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) మండల కార్యదర్శి పుచ్చకాయల నర్సింహారెడ్డి తెలిపారు. మండలంలోని కేశవాపురం, లక్ష్మీపురం, బంధంపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన ఆధ్వర్యంలోని బృందం సందర్శించి పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు, కూలీలకు వేతనాలు నిర్దేశిత సమయంలో చెల్లించడంలో ప్రభుత్వం విఫలమౌతోందని విమర్శించారు. నాలుగు నెలలుగా వేతనాలు బకాయి ఉండడంతో ఎఫ్‌ఏలు కుటుంబాలతో సహా అర్ధాకలితో అలమటిస్తున్నారని చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ఎఫ్‌ఏలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, నర్సింహస్వామి, స్వామి, లక్ష్మణ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్‌లో ‘అక్షర’ విద్యార్థుల ప్రతిభ



నర్సంపేట : విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రాజేందప్రసాద్‌రెడ్డి, తదితరులు

నర్సంపేట : పట్టణంలోని అక్షర ద స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో ప్రతిభ కనబర్చారు. జూనియర్ లెవల్–1 విభాగంలో కె.లోక్షిత్ స్టార్ (మొదటి) అవార్డు సాధించాడు. జోనల్ లెవల్‌లో జరిగిన అబాకస్ లెవల్–2 పోటీలో స్టార్ జూనియర్ విభాగంలో ఆర్.దీక్షిత్ గోల్డ్ మెడల్, బి.శశాంక్ నాయక్, కె.హన్సిత్ సిల్వర్ మెడల్స్ సాధించారు. అలాగే జూనియర్ విభాగంలో బి.పవన్ గోల్డ్, బి.మన్విత్‌రావు సిల్వల్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చి మెడల్స్, సర్టిఫికెట్స్ సాధించిన విద్యార్థులను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ వనజ స్కూల్ ఆవరణలో మంగళవారం అభినందంచారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.జ్యోతి, అక్షర ద స్కూల్ ప్రిన్సిపాల్ జి.భవాని, సీఏఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ సర్టిఫికెట్ల అందజేత

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో ఎన్‌సీసీ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన 49 మంది విద్యార్థులకు ఎన్‌సీసీ అధికారులతో కలిసి బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతాయని చెప్పారు. భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. 40 మందికి ‘ఏ’ గ్రేడ్, 9 మందికి ‘బీ’ గ్రేడ్ సర్టిఫికెట్లు అందించినట్టు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్‌రెడ్డి ఎన్‌సీసీ పదో బెటాలియన్ అధికారులు హవల్దార్ నిఖేశ్, సంతోశ్, థర్డ్ ఆఫీసర్ రియాజొద్దీన్, పీఈటీ భవానీచంద్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి



రాయపర్తి : మండలంలోని రాగన్నగూడెంలోని పోచమ్మ గుడి అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ నేత, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆలయ సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన మంగళవారం గ్రామాన్ని సందర్శించి ఆలయ దుస్థితిని పరిశీలించారు. ఫౌండేషన్ నిధులతో ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడతామని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలే నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల మధూకర్‌రెడ్డి, కోల సంపత్, యాదవరెడ్డి, చందు సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

## నివాళి



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన లింగాల రాములమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, మాజీ వార్డు సభ్యులు మేడి సంతోశ్, కన్నం వెంకన్న, మండల రవి, మాజీ ఉపసర్పంచ్ మేడి వెంకటేశ్వర్లు, నాయకులు డాక్టర్ కత్తి స్వామి, కుండె భద్రయ్య, కన్నం కుమార్, అన్న కమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

ఖానాపురం : సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు రెన్యువల్ చేయించుకోవాలని సీఈఓ ఆంజనేయులు కోరారు. సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంట రుణాలు తీసుకున్న రైతులు ఏటా 7 శాతం (58 పైసలు) వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. గడువు దాటితే 13 శాతం వడ్డీ పడుతుందని తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు ప్రభుత్వం 7 శాతం వడ్డీలో 3 శాతం రాయితీ రూపంలో తిరిగి చెల్లిస్తుందని వివరించారు.

## గుడుంబా విక్రేతలపై కేసు నమోదు

గీసుకొండ : మండలంలోని పలు ప్రాంతాల్లో గుడుంబా కేంద్రాలపై స్థానిక పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. జాన్‌పాకలో అంగోతు సునీత వద్ద 5 లీటర్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మహేందర్ తెలిపారు. మచ్చాపూర్‌కు చెందిన కోల సాంబయ్య, గరీబ్‌నగర్‌కు చెందిన ఇల్లందుల రాకేశ్, జాన్‌పాకకు చెందిన గుగులోతు శిరీశ, బోడ సురేశ్, తేజావత్ బుజ్జిలను తహసిల్దారు రియాజుద్దీన్ ఎదుట హాజరుపర్చగా రూ.లక్షకు బైండోవర్ చేశామన్నారు.

## మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

నల్లబెల్లి : మండలంలోని మేడపల్లిలో అంబేడ్కర్ విగ్రహ సమీపంలో నాగరాజు చికెన్ సెంటర్‌లో మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్ ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాగరాజు షాపులో మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహ గద్దెపై కూర్చుని తాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, నరేశ్, కుమారస్వామి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతో అగ్ని ప్రమాదాలకు చెక్

● అగ్నిమాపక అధికారి జయపాల్‌రెడ్డి



ప్రమాదాల నివారణపై ప్రదర్శన ఇస్తున్న సిబ్బంది

వర్ధన్నపేట : అవగాహన పెంచుకోవడం ద్వారానే అగ్నిప్రమాదాలకు చెక్ పెట్టగలమని అగ్నిమాపక అధికారి జయపాల్‌రెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక అగ్నిమాపక దళ అధికారులు, సిబ్బంది అగ్నిమాపక నివారణ జాగ్రత్తలపై స్థానిక ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ సెంటర్ వద్ద మంగళవారం ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయపాల్‌రెడ్డి మాట్లాడారు. అగ్నిప్రమాదాలను నివారించే దిశగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మంటలను ఆర్పేందుకు చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురవకుండా ముందుగా అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే మంటలను ఆర్పేందుకు పాటించాల్సిన చిట్కాలను తెలిపారు. గ్యాస్ సిలెండర్ లీకేజీ అయి మంటలు వచ్చినపుడు సమయస్ఫూర్తితో మంటలను అదుపులోకి తీసుకొచ్చే అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ఉద్యోగులు రవీందర్, దేవేందర్‌రెడ్డి, అజ్మీర్ పాషా, శ్రీకాంత్, గోపాల్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

● వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి



ఊకల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి

రాయపర్తి : పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ఊకల్‌లో పీఏసీఎస్, ఎర్రకుంటతండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు సరైన ధర కల్పించే దిశగా పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతకు తగినట్టు ధర లభిస్తుందని చెప్పారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పాలకుర్తి సోమేశ్వరాలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, ఏపీఎం కిరణ్‌కుమార్, సీఈఓ సోమిరెడ్డి, పీఏసీఎస్ అధికారులు ఐత మల్లేశ్, రాకేశ్, హరినాథ్, రాంబాబు, పాల శ్రీనివాస్, గొల్లపల్లి సదా శ్రీను, బూడిద రవి, గుగులోతు శ్రీనివాస్, సీసీ యాదగిరి, నాయకులు జినుగు రత్నాకర్‌రెడ్డి, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మహిళలకు ‘సఖి’ సేవలు



చింతలపల్లిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శోభారాణి, తదితరులు

● లీగల్ కౌన్సెలర్ శోభారాణి

సంగెం : గృహహింస, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సఖి కేంద్రాల్లో అవసరమైన సేవలు అందిస్తున్నట్టు లీగల్ కౌన్సిలర్ శోభారాణి తెలిపారు. మండలంలోని ఎల్గూర్ రంగంపేట, చింతలపల్లి గ్రామాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆమె అవగాహన కల్పించారు. సమాజంలో పలువురు మహిళలు గృహహింస, ఇతర వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొంత మంది బాలికలు లైంగిక వేధింపులు వంటి సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధిత మహిళలకు, బాలికలకు అండగా నిలిచే దిశగా సఖి కేంద్రాలు ఏర్పాటు చేశాయన్నారు. సఖి కేంద్రాల్లో బాధిత మహిళలకు, బాలికలకు ఉచితంగా తాత్కాలిక వసతి, కౌన్సెలింగ్, వైద్యం, న్యాయ, ఇతర సేవలు అందిస్తున్నట్టు వివరించారు. సమాజంలోని మహిళలందరూ హక్కులు, చట్టాల గురించి చైతన్యవంతం కావాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సఖి కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు బాల్యం నుంచే నైతిక విలువలు అలవర్చితే సమాజంలో హింస చాలా వరకు తగ్గుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గృహహింస, బాల్య వివాహాల నిరోధక, పోక్సో తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం సఖి సేవలు, టోల్ ఫ్రీ నంబర్లతో కూడిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఓఏలు ప్రవీణ, రాజు, సఖి సెంటర్ కేస్ వర్కర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ సామాజిక బాధ్యత


● బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్



మాట్లాడుతున్న హామ్యానాయక్

రాయపర్తి : రాజ్యాంగ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి కోరారు. మండలంలోని తెట్టెకుంటతండా, గన్నారం, తిర్మలాయపల్లి గ్రామాల్లో మంగళవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హామ్యానాయక్, రవీందర్‌రెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల వల్లే బడుగు బలహీన వర్గాల ప్రజలు ప్రజాస్వామ్యయుతంగా జీవనం సాగించగలుగుతున్నారని తెలిపారు. కార్యక్రమాల్లో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, పార్టీ నియోజకవర్గ నేత కృష్ణమాచార్యులు, నాయకులు చిర్ర మల్లయ్య, అఫ్రోజ్, మచ్చ కుమారస్వామి, గుగులోతు శ్రీనివాస్, మాచర్ల ప్రభాకర్, కుంట రమేశ్, కందికట్ల రాజయ్య, జినుగు రత్నాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహమూద్, ఉల్లెంగుల నర్సయ్య, గబ్బెట బాబు, వనజారాణి, కోటేశ్వర్, నరోత్తం రెడ్డి, చెట్టె ఎల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పంటల నష్టంపై సర్వే



కొలన్‌పల్లిలో పంటలను పరిశీలిస్తున్న ఏఈఓ

రాయపర్తి : ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి మండలంలో జరిగిన పంటల నష్టంపై ఏఈఓ మనస్విని సర్వే నిర్వహించారు. మండలంలోని కొలన్‌పల్లి, జింకురాంతండాలను ఆమె సందర్శించి పంటల నష్టాన్ని అధ్యయనం చేశారు. రైతులతో సమాచారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఈనెల 13న కురిసిన వడగండ్ల వర్షానికి పలు గ్రామాల్లో భారీగా పంటల నష్టం జరిగిందని చెప్పారు. ఈ క్రమంలోనే అధికారుల ఆదేశాల మేరకు సర్వే చేపట్టి నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించనున్నట్టు తెలిపారు. పరిహారం అందజేతపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
కె. రమేష్ (S.R) : 9441304664 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944